# నిజాయితీపరుడు

“[illegible] బాబూ, ఒక కాణీ ధర్మం చెయ్యండి. ధర్మ ప్రభువులు మీ కెంతో పుణ్యం వుంటుంది” అంటి నా దగ్గిరలో ఒక గొంతుక. ప్రక్కకు తిరిగి చూశాను ఎవరా అని. ఓ కుష్ఠు గాడు చేతిలో కర్ర ఆసరాగా నడుస్తూ వస్తున్నాడు నా దగ్గరగా.

“కాణీ లేదు, నీకేం లేదు పో. ఇదొక పెద్ద న్యూసెన్సు అయిపోయింది మద్రాసులో” అన్నా చిరాగ్గా. నన్ను గురించి ఏమనుకుంటాడో కాని నా వంక ఒక సారి తీక్ష్ణంగా చూసి వెళ్ళిపోయాడు అక్కడ నుంచి వాడు.

“ఏరా ఎంత డబ్బు ఖర్చు చెయ్యటం లేదు మనం సిగరెట్లకి, సినిమాలకెందా? ఒక్క కాణీ ఆ భిక్షగానికి ధర్మం చేస్తే నీకు లోటు వచ్చిందా?” అన్నాడు నన్ను నిందిస్తూ వెంకటేశ్వర్రావు.

“నీకు తెలియదు భాయ్. ఈ పూళ్ళో కాసేపు ఎక్కడైనా సరే సిగరెట్లు కాలుస్తూ నిలబడ్డామంటే చాలు. ఈగలు ముసిరినట్టు ముసురుతారు ఈ ముష్టివాళ్ళంతా. పైగా ఒక రోజు అలవాటు చేశామంటే చాలు, ఇక రోజూ మనం ఎక్కడ కనపడ్డా పీక్కు తింటారు. అంతే కాకుండా మనం వాళ్ళకు ధర్మం చెయ్యడంవల్ల ఈ ‘ముష్టి బిజినెస్’ను ఎంకరేజ్ చేస్తున్న వాళ్ళం అవుతాం. చూడగా చూడగా వాళ్ళకి ఇదే సులభంగా కనబడి వాళ్ళలో సోమరితనం పెరిగి పోతుంది. అంతే కాని వీళ్ళమీద సానుభూతి లేక కాదు భాయ్” అని ఒక చిన్న ఉపన్యాసం దంచేసరికి మా వాడు తెల మొహం వేశాడు. ఇద్దరం సిగరెట్లు కాల్చుకుంటూ పాండీబజారు వైపు నడిచాం.

మా వాడు దీన్ని గురించి ఆలోచిస్తున్నాడో అర్థం కాలేదు కాని, ఏమీ మాట్లాడకుండా నడుస్తున్నాడు. బహుశా నేను చెప్పిన మాటల్ని మననం చేసుకుంటున్నాడేమో అనుకున్నాను. నా మాటల ప్రభావం వాడి మీద అంత తొందరగా పని చేసినందుకు నన్ను నేనే అభినందించుకున్నాను.

“సార్! సార్!” అని కేకలు వినపడేసరికి నా ఆలోచనా ప్రవాహం ఉన్నట్టుండి ఆగి పోయింది.

“మాస్టారు మీరు తెలుగువాళ్ళేనా?” అని ఇంగ్లీషులో అడిగాడు ఆ అపరిచిత వ్యక్తి. మనిషి నీటుగానే వున్నాడు. బట్టలుగూడా అందుకు తగ్గట్టుగానే వున్నాయ్. చూడగానే ఏ గొప్పింటి అబ్బాయో అనిపించింది.

“ఏం అలా అడిగారు? మేం తెలుగు వాళ్ళమే” అన్నాడు మా వెంకట్.

“ఏం లేదు. ఈ పూళ్ళో అరవవాళ్ళ మధ్య తెలుగువాళ్ళని తెలుసుకోటం కూడా కష్టంగానే వుంది. అంతా అరవమే మాట్లాడేస్తారు. పైగా మన ఆంధ్ర రాష్ట్రం వచ్చిన తర్వాత యిక్కడ తెలుగువాళ్ళం అని చెప్పుకుంటే అదో మాదిరిగా చూస్తున్నారని తెలిసింది.”

“సరే అసలు సంగతేమిటో చెప్పండి” అన్నాను కొంచెం విసుగ్గానే.

శ్రీ ఎస్. వసంత్ కుమార్

“మీరు నేరే అపార్థం చేసుకోనంటే నా కష్టగాథ మీకు చెప్పుకుంటాను. మాది బెజవాడ. ఇక్కడ వుద్యోగానికని ఇంట్లో చెప్పకుండా వచ్చాను. నాతో తెచ్చుకున్న డబ్బు నాలా క్రొంచెము. వచ్చి పదిరోజులయింది. ఎంతో జాగ్రత్తగా కాలం గడుపుతూ వచ్చాను. కాని మొన్న మైలాపూర్ వెళ్ళి వస్తూంటే బస్సులో నా పర్సు కొట్టేశారు ఎవరో. రెండు రోజుల్నుంచీ కాఫీ కూడా త్రాగలేదు. నాకు ఏం చెయ్యడానికి దిక్కు లేదు. మా వాళ్ళకు ఒక టెలిగ్రాం యిచ్చాను. డబ్బు రాగానే మీ డబ్బు యిచ్చేసి మా వూరు వెళ్ళి పోతాను. నాకు యీ కాస్త ఉపకారం చేసి పెట్టండి” అని దీనంగా అడిగాడు.

“పాపం!” అన్నట్లుగా మా వెంకట్ నా వంక చూశాడు. ఆ చూపులో ఎన్నో అర్థాలు ఇమిడి వున్నాయ్. వాడిది చాలా జాలిగుండె. ఒకరు కష్టపడుతుంటే చూసి ఓర్వలేడు. అందరి కష్టాలు తనలాంటివే అనుకుంటాడు. వాడి దగ్గరకు వచ్చి ఎవడూ వట్టి చేతులతో తిరిగిపోడు.

పైగా నా విశాల హృదయాన్ని చాటుకోవడానికి ఇదే మంచి సమయం అనుకున్నాను. ‘సరే’ అని ఆ కేసి చూశాను. అతడు నా అడ్రసివ్వమని చెప్పాడు.

“మరి యీ పూట భోజనం ఎలా చేస్తారు” అని అడిగాను.

“నిన్న, మొన్న ఎలాగో యివాళ్ళ అలాగే. ఈరోజూ కూడా ఏకాదశే!” అన్నాడు.

“పోనీ మా హోటల్లో భోంచెయ్యండి!” అన్నాను సానుభూతి ప్రదర్శిస్తూ.

“ఒక్క షరతుమీద!”

“ఏమిటది?”

“నాకు డబ్బు రాగానే మీరు యీ భోజనం డబ్బులు కూడా తీసుకుంటానంటేనే నేను భోజనం చేస్తాను.”

“అలాగే లెండి”

“అలాగ్గాదు. ఇప్పటికే మీరు నా కెంతో సహాయం చేశారు. ఇంకా మిమ్మల్ని ఎక్కువ కష్టపెట్టలేను. ఎలాగో ఒక్కరోజు ఓర్చుకుంటే హాయిగా ఇంటికి పోతాను మీ ధర్మమా అంటూ.”

“మేం భోంచేసి మీరు పస్తుంటే మేం చూస్తూ ఎలా వుండగలం చెప్పండి. ఏదో మా కున్నంతలోనే మీరూ తినండి.”

“నన్ను బలవంతం చెయ్యకండి సార్. నాకు కొన్ని ప్రిన్సిపల్స్ వున్నాయ్. వాటిని దాటలేను ఏ పరిస్థితుల్లోనూ.”

“పోనీయండి. మీరు చెప్పినట్లే మీ కింద ఖర్చు పెట్టిన డబ్బు అంతా మీరు రాగానే యిచ్చేదురుగాని లెండి” అన్నాను అతని పట్టుదలకు ఆశ్చర్యపోతూ.

పాపం ఎంత బుద్ధిమంతుడు. ‘ఒక పూట రాజు, ఒక పూట రౌతు’ అన్న ఆర్యోక్తి నిజమే ననిపించింది. ఆరోజు మాతోనే భోంచేసి మా గదిలోనే వున్నాడు. ఆ ఒక్క పూట పరిచయంలోనూ తన జీవిత రహస్యాలన్నీ మాకు చెప్పాడు. ఆ కొద్ది కాలంలోనూ మా కెంతో దగ్గిరయ్యాడు. అతని పేరు శ్రీరామ్మూర్తి. ఇంటర్ ప్యాసయ్యాడట. అతనితో పాటు చదువుకునే ఓ అమ్మాయిని

ప్రేమించాడుట. వాళ్ళ నాన్న అందుకు అంగీకరించలేదట. తను స్వంతంగా సంపాదించుకోగలిగితే వాళ్ళ నాన్న ఆ స్థితిలో ఆధారపడవలసిన అవసరం వుండదనీ, అప్పుడు తనకిష్టం వచ్చిన స్త్రీని పెళ్ళి చేసుకోవచ్చునని ఊహించి వుద్యోగం కోసం మద్రాసు వచ్చాడు. తానొకటి తలిస్తే దైవం వొకటి తలుస్తుందని పాపం చివరకు డబ్బుపోయి యిక్కట్లు పడవలసి వచ్చింది.

అతని కథ వింటుంటే నాకూ నా చిన్ననాటి విషయాలు జ్ఞాపకం వచ్చినై.

మా ఇంటి ప్రక్కనున్న అమ్మాయితో నున్న నా సంబంధాన్ని మా నాన్నకు చెప్పి దానా పెళ్ళికి అనుమతించమంటే ఆయన ససేమిరా ఒప్పుకోనన్నారు. చేసేది లేక పితృవాక్య పరిపాలకుడైన శ్రీరాముడు నా ఆదర్శమూర్తిగా ఎన్నుకుని ఆ ప్రదేశం మానుకున్నాను. నా కన్న ఈ వ్యక్తి ఎంతో ధైర్యవంతుడని మెచ్చుకున్నాను. తను నమ్మిన దానికోసం — ధైర్యంగా నిలబడి పోరాడగలిన యోధుడు. అందుకనే అతన్ని చూడగానే ఎందుకో ఓ విధమైన మమకారం కలిగింది. చిన్నతనంలో ఆవేశంతో అందరూ చేసే పనులే అతనూ చేశాడు. అందువల్ల నేనేమో అతనిదగ్గా నే కాదనలేక పోయాను.

ఆ రోజు రాత్రి కూడా మాతోనే కాలం గడిపాడు. ఆ రోజు మనియార్డరు రాలేదు. ఒక వేళ సాయంత్రం అందిందేమో రేపు గామ్. అందువల్ల మర్నాటి వుదయం డబ్బు పంపుతారేమో అనుకున్నాం. అయితే ఆ రోజూ రాలేదు. బహుశా చేతిలో సమయాని లేక పంపలేదో, ఒక వేళ పంపినా ఆ రోజు ఆదివారం కాబట్టి ఆర్డరీ మనియార్డరు సోమవారం కాని రాదు కాబట్టి ఆదివారం కూడా అతను మా రూములోనే వున్నాడు. ఈ మూడు రోజులూ అతను కూడా మాతో బాటే హోటల్లో భోం చేశాడు. కాఫీలు సిగరెట్లు అన్నీ, సక్రమంగా సరిఅయిన వేళకు సమకూరేవి. అయితే అతను మటుకు సిగరెట్లు డబ్బులతోసహా లెక్క రాసి వుంచేడు. మొత్తం మూడు రోజులకూ అతని కింద ఖర్చయింది అయిదు రూపాయల పదకొండు అణాల మాత్రం —

మర్నాడు సోమవారం కాబట్టి తప్పక డబ్బు వస్తుందనీ, తను ఆ రాత్రే మెయిల్కు వెళ్ళిపోతానని చెప్పాడు. ఒకటి, రెండు రోజులు మేము వుండమని బలవంతం చేసినా అతను ఉండటానికి వీలేదని, వెళ్ళిపోవాలని చెప్పాడు. సరే నన్నాం మేం కూడా. సోమవారం ఉదయం నిద్ర లేచేసరికి అతను కనపడలేదు. 'ఎక్కడికి వెళ్ళాడురా?' అని వెంకట్ని అడిగాను.

"ఏమోరా, నేను లేచేసరికి లేడు. మొత్తంమీద పొద్దున్నే ఎక్కడికో వెళ్ళాడు స్నానం చేసి" అన్నాడు వెంకట్.

ఒక వేళ ఎక్కడకయినా వెళ్ళాడేమో అనుకున్నాం. కాని ఎంతకూ అతని జాడ లేదు. ఆ రోజు సాయంత్రం కూడా అతను రాలేదు. మంగళవారం అంతే. అతనే కాదు — అతను వస్తుందన్న మనియార్డరూ రాలేదు. నన్ను మోసగించాడా అని అనుమానం వచ్చింది. చదువుకున్న వాడూ, గొప్పఇంటి బిడ్డ, అంత నీచంగా ప్రవర్తిస్తాడా? అనుకున్నాను. 'ఏరా వెంకటేశం ఏమంటావ్ అతన్ని గురించి?' అని అడిగాను.

"ఆ సందు కేముంది భాయ్. అతను అనుకున్న పని అయిపోయింది. అతను వెళ్ళిపోయాడు" అన్నాడు గంభీరంగా.

"ఏమిటోరా నువ్వు చెప్పేది? నాకేం బోధ పడటం లేదు" అన్నాను.

"అతను తిండిలేక చాలా బాధపడుతున్నాడు. 'నేను భోంచేసి రెండు రోజులయింది. ఒక పూట భోజనం పెట్టించండి' అని ఎవర్నయినా అడిగితే నీకేం దుక్కలా వున్నావ్. పని చేసుకోలేవూ అని తిడతారు. అందుకే తెలివిని వుపయోగించి ప్లాన్ వేశాడు. ఎంత తేలిగ్గా టోపీలో పడ్డావ్."

"అంతా మోసం! చదువుకున్న వాడు, సంస్కారం కలవాడు ఒక పూట తిండి కోసమని ఇంత మోసానికి తలపడతాడా?"


"ప్రపంచమే అందుకు కారణం బ్రదర్. ఆకలి వాడు ఒక్క కానీ కావాలని దైన్యంగా అడిగితే వాణ్ణి తిట్టావ్. 'సుష్టి బిజినెస్' మీద ఉపన్యాసాలు దంచావ్. మరి అదే ఓ చదువుకున్న యువకుడు, నీటుగా, ఇంగ్లీషులో


కోతి మార్కు నల్ల పళ్ళపొడి

స్థాపితము 1911




హైదరాబాద్ బ్రాంచి: సుల్తాన్ బజార్ సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకి
ఎదురుగా హైదరాబాద్, (దక్కన్).



"లేదుపో..." అన్నాను

అడిగేవరికీ కాదనలేక పోయావు. ఏమిటి కారణం? అతని దీన భావాలు. ఈనాటి ఈ వాతావరణంలో జాలికి ఎక్కువ ప్రాధాన్యతి వుంది సమాజంలో. ఈ ఉదాహరణకు నిత్య జీవితంలో జరిగే ఒక చిన్న విషయం చూడు. బస్ స్టాండులో నువ్వు బస్ కోసం నిలబడి వున్నావనుకో. పొరపాటున ప్రక్కనుంచి ఓ పల్లెటూరివాడు, అనాగరికుడు నీ కాలు తొక్కాడనుకో. నీ కెంత కోపం వస్తుంది. కోపంతో చూసి నడవలేడా అంటావ్. తప్పుకోకపోవటంవల్ల నష్టమే అదంటావ్. వాడ్ని అన్ని భాషల్లోనూ నానా తిట్లు తిడుతావ్. అదే ఓ ఆఫీసరు లేక బాగా చదువుకున్నట్లుగా కనపడేవాడు, లేక బాగా డబ్బు గలిగిన పెద్ద మోతుబరి బస్ ఎక్కాలనే ఆదుర్దాలో నీ కాలు తొక్కాడనుకో, ఒకసారి అతను నీ వంక చూసి 'సారీ' అంటే నీ నోరు మూత పడుతుంది. అలా అనలేదు కాబట్టే ఆదే సంఘటనకు గురిఅయిన ఆ పల్లెటూరివాడ్ని తిట్టావ్. అందుకే మనం ఆంగ్లేయుల నాగరికంలో బతుకుతున్నామని చెబుతున్నాను. అలా ఉన్నంత కాలం మనం కూడా కృతజ్ఞతకి ఎక్కువ ప్రాధాన్యతి ఇస్తాం."

"నీ మొహం లేరా! వాడి కిలాగా జాలి కలిగి కాని వాడి మాటలకేం బోల్తాపడలేదు."

"క్వైనైన్ చేదుగా వుంటుంది కాబట్టి దాన్ని మనం తినలేము. అందుకే దానిమీద షుగర్ కోటింగ్ వేస్తారు. సత్యం అనేది క్వైనైన్ అయితే దాన్ని రెజంట్ చేసే 'అబద్ధం' షుగర్ కోటింగ్ లాంటిది. అంత అట్రాక్టివ్‌గా వుంటే కాని నువ్వు దాన్ని అభినందించలేవు. పోతే మానవుడికి కొన్ని ధర్మాలు అంటూ వున్నాయ్. అవి మానవుడు మరిచి ప్రవర్తించినప్పుడు భగవంతుడు మన కళ్ళు తెరవటానికి ఏదో ఒక అవతారం ఎత్తి ధర్మ సంస్థాపన చేస్తాడు. మనకోసం ప్రతి రోజూ, ఒక్కొక్క అవతారం ఎత్తలేడు కాబట్టి ఇలాంటి వ్యక్తుల ద్వారా మనకు జ్ఞానబోధ చేస్తాడు. నిజంగా అతనికి రెండు రోజులు అన్నం పెడితే నీకు పోయేదేమీ లేదు. అయితే అందుకు నువ్వు ఒప్పుకోలేవు. అందుకే ఇలాంటి నాటకం అవసరం అయింది. ఆ దయాదాక్షిణ్యం, తోటి మానవుల కష్టాల్ని చూసి సానుభూతి చూపడం నేర్చుకో. అయితే ఆ భిక్షు వ్యక్తి కూడా చాలా గొప్పవాడంటాను. అతనికి ధర్మం, నీతి, నియమం అనేవి వున్నాయ్. మూడు రోజులు నీ గదిలో వుండి తిన్నాడు. ఆ విశ్వాసంతోనే అతను నిన్ను మనస్ఫూర్తిగా ధన్యవాదాలు అర్పించుకుని వెళ్ళిపోయాడు. పోతూపోతూ నీ వస్తువు ఒక్కటి కూడా అతను ముట్టుకోలేదు. నీ పెన్ను, వాచీ, పర్సు, లేక మరే వస్తువయినా అతను తనతో తీసుకుపోయాడనుకో! నువ్వేం చేయగలిగే వాడివి? అతనెంత నిజాయితీ గల మనిషో కాస్త ఆలోచించు. ఆ మాత్రం విశ్వాసం, నిజాయితీ మనలో ఎంతమంది వుంటుంది. 'కోటివిద్యలూ కూటికొరకే' అన్న ఆర్యోక్తిని అతను అక్షరాలా పాటిస్తున్నాడు" అని ఓ పెద్ద లెక్చర్ ఇచ్చాడు వెంకటేశ్వర్లు.

నాకు కళ్ళు తిరుగుతున్నట్టుగా అయింది. నా కాళ్ళు గాలిలో తేలిపోతున్నట్టుగా వుంది. నాకు వెంకు చెప్పిన మాటలే నా చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నై. ★